క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రక్షాపురం, రియాసత్‌నగర్, ఆలిజాకోట్లా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వాహనాల తనిఖీ



సంతోష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలి



వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: మహ్మద్ ప్రవక్త ప్రవచనాలతో ప్రజలందరూ శాంతియుతంగా మెలగాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. శాంతి సామరస్యాలు కలిగే విధంగా మహ్మద్ ప్రవక్త బోధనలు ఉన్నాయని, సమాజమే శాంతియుతంగా ఉండాలన్నారు.

తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ప్రారంభం



లాంగ్ డ్రైవ్ తీసుకుంటున్న గోల్ఫర్

గోల్కొండ: తెలంగాణ ప్రీమియర్ లీగ్ గోల్ఫ్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. గోల్కొండ నయాకిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో 3వ సీజన్ ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఎంవైకే స్ట్రైకర్స్, సెలబ్రిటీస్ స్ట్రైకర్స్ మధ్య పోటీ నెలకొంది. ఎవెంజర్స్ టీమ్ 6-2తో కేఎల్ఆర్ కింగ్స్‌ను ఓడించింది. మరో గేమ్స్‌లో ఆటమ్ చార్జర్స్ డెక్కన్ నవాబ్స్‌ను ఓడించింది. కాగా ఈ పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి వందిత్‌రెడ్డి అన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



ఏరియా ఆస్పత్రి ఫార్మసీ కౌంటర్ వద్ద రోగుల రద్దీ

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి బాగా పెరిగింది. గత కొన్ని రోజులుగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. డెంగ్యూ, మలేరియాతో పాటు వైరల్ ఫీవర్ విజృంభణతో బాధితులు ఆస్పత్రుల వద్ద బారులు తీరుతున్నారు. ఏరియా ఆస్పత్రితో పాటు బస్తీ దావాఖానాలు సైతం రోగులతో నిండిపోతున్నాయి. డెంగీబారినపడ్డ వారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ బాధితులకు సరైన వైద్యం లభించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేక తాము ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నామని పలువురు అంటున్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో సీజనల్ వ్యాధిగ్రస్తులకు సరైన వైద్యం అందిస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా పేర్కొన్నారు. ఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగం గత కొన్ని రోజులుగా మళ్లీ ఆక్యుపెన్సీ పెరిగిందని ఆయన తెలిపారు. రోగులకు కావాల్సిన మందులకు ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.



కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

సుల్తాన్‌బజార్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థులు తెలంగాణ బతుకమ్మ పాటలపై లయాబద్ధమైన స్టెప్పులతో బతుకమ్మను ఆడారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కోఠిలోని విశ్వవిద్యాలయంలో ఉన్న దర్బార్ హాల్ వద్ద విశ్వ విద్యాలయం విద్యార్థులు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత హాజరై సంబరాలను ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బతుకమ్మను ఎంతో హుషారుగా, ఉత్సాహంగా ఆడారు.





మైనార్టీలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



సమావేశంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: మైనార్టీలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ అమర్ నగర్ కాలనీ వద్ద నిర్వహించిన మైనార్టీ జల్సాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. షాదీముబారక్ లాంటి పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఆయాన శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీలకు అండగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ సలీం, అన్వర్, హజర్, అమీర్, అహ్మద్‌ఉల్లా, రవి, అర్జున్, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా కళాశాల వార్షికోత్సవం

సుల్తాన్‌బజార్: మెరిట్ విద్యార్థులకు భవిష్యత్ ఎంతో బాగుంటుందని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం 100వ వార్షికోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు పోటీలు పడి వెస్ట్రన్ భారతీయ నృత్యాలను ఎంతో హుషారుగా చేశారు. మెరిట్ విద్యార్థులకు ముఖ్యఅతిథి లింబాద్రి, ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ చేతుల మీదుగా విద్యార్థులు మెడల్స్ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులతలతోపాటు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్థికాభివృద్ధిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న దేవరపల్లి మహేష్

గన్‌ఫౌండ్రీ: అమరవీరుల త్యాగల ఫలితాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సరైన మేలు జరుగలేదని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సోమవారం గన్‌ఫౌండ్రీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రాంతీయ అభివృద్ధి, అసమానతలు-ఎన్నికలు అనే అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి ఎస్ఎస్.భాషా మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిని, ఆర్థిక ఉనికిని కాపాడుకునేందుకు ప్రజలు ఐక్యమత్యంతో కదలి రావాలని సూచించారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ మాట్లాడుతూ.. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ యువతకు అధిక ప్రాధ్యానత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నంది కొండల్‌రావు, కొల్లా సుధాకర్, ఎస్.నవీన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్యభద్రత పథకం



ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత పథకం ప్రారంభించడం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పెద్ద నిర్ణయం తీసుకున్నారని టీఎన్జీఓస్ హైదారబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్‌పై ప్రభుత్వం జీఓ విడుదల చేయడం ఎంతో అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకవైపు రైతులు, మరోవైపు ఉద్యోగులు, సామాన్యులు పెన్షనర్లు ఆనందంగా జీవించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల తరపున ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈహెచ్ఎస్ పథకంతో లక్షలాది మందికి లాభం చేకూరుతుందన్నారు.

బీజేపీ టికెట్ కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్‌యాదవ్, జియాగూడ డివిజన్ బీజేపీ పదాధికారులు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం నుంచి యువకుడైన గోల్కొండ జిల్లా బీజేపీ డైయిరీసెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్‌కు కార్వాన్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని జియాగూడ డివిజన్ బీజేపీ నాయకుడు, శివకుమార్ యాదవ్ కోరారు. సోమవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో యువకుడైన శివకుమార్‌యాదవ్ మంచిపట్టు ఉన్న నాయకుడని టికెట్ కేటాయిస్తే తప్పకుండా గెలిపించి చూపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పదాధికారులు రాజ్‌పాల్, భాస్కర్‌గుప్తా, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులను ఆదుకోవాలి

గన్‌ఫౌండ్రీ: రాబోయే శాసనసభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల మాతృసంఘం కోరింది. సోమవారం విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్.మధుసుదనాచారి, బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ కన్వీనర్ బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణులు నిర్లక్ష్యానికి గురై ఆకలి చావులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో విశ్వబ్రాహ్మణుల అంశాలను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న నరహరిచారి, కిషోర్‌కుమార్

జియాగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ సంబరాలు తలమాణికంగా నిలుస్తాయని జియాగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ బీఆర్ఎస్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం జియాగూడలోని భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ చీరలు పొందిన మహిళలు సంబరాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ రాజేష్, హేమంత్‌కుమార్, ప్రకాష్, దేవేందర్‌సాగర్, జీహెచ్ఎంసీ మధు తదితరులు పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

షాజహాన్ ఫంక్షన్ హాల్‌లో..

యాకుత్‌పురా: యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సోమవారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. తలాబ్‌కట్టా షాజహాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో ఆయన మొఘల్‌పురా కార్పొరేటర్ నస్రీన్ సుల్తానాతో కలిసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఆమన్‌నగర్-బి ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మోహీనుద్దీన్, నాయకులు షేక్ జాఫర్, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ యుసీడీ విభాగం అధికారులు, పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ దెబ్బకు బీఆర్ఎస్ ఖతం అని బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయనను సోమవారం బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆయనకు శాలువా కప్పి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్ ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థికంగా దివాలా తీసిందని రాష్ట్ర ఆదాయం కంటే ఎన్నో రెట్ల అప్పులే ఉన్నాయని ఆయన ఆరోపించారు. మరో వైపు మంత్రి కేటీఆర్ తెలంగాణలో విదేశీ సంస్థలు వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నాయంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, అనూయాదవ్, మాణిక్‌ప్రభు, కట్ల అశోక్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి వల్లే ఆరోగ్య సమస్యలు



డాక్టర్ ఎం.ఎ.ఖరీమ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగర్ కాలనీ: ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడి మునుపెన్నడూ లేని విధంగా పెరిగిందని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎం.ఎ.ఖరీమ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సోమవారం మెహిదీపట్నం సత్‌భావన ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం మన ఆలోచనలపైన ఆధారపడి ఉందని ఎప్పుడు ఉల్లాసంగా ఉంటూ మంచి గురించి మంచి భవిష్యత్తు గురించి ఆలోచిస్తు ఉండాలని అన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని దీన్ని వల్ల మానసికంగా వ్యక్తి దృఢంగా ఉంటారని ఆయన అన్నారు. వ్యసనాలకు బానిసైన వారు తొందరగా ఒత్తిళ్లకు గురవుతారని సరైన నిర్ణయాలు తీసుకోలేరని అన్నారు. దీన్ని వల్ల వారు మానసిక ఒత్తిళ్లకు గురవ్వడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని అన్నారు. ఈ సందర్భంగా సత్భావన ఫోరం గౌరవ చైర్మన్ డి.మహేష్ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా ఎందరికో కౌన్సిలింగ్ నిర్వహించి మానసిక రుగ్మతులను దూరం చేసిన మహావ్యక్తి డాక్టర్ ఎం.ఎ.ఖరీమ్ అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మీయ సత్భవన స్ఫూర్తి అవార్డును ప్రకటించారు.ఈ సందర్భంగా ఫోరం సభ్యులతో కలిసి డాక్టగర్ ఎం.ఎ.ఖరీమ్‌కు శాలువాకప్పి మెమోంటో అందించి సన్మానించారు. ఫోరం ముఖ్య సలహాదారు మహ్మద్ ఖైరుద్దీన్, సలహాదారులు ముస్తాక్ ఆలీ, రమణ, జాతీయ యువజన అవార్డీ ఫోరం అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మాజీద్ ఆలీ పాల్గొన్నారు.

సత్కారం



మక్బూల్ అహ్మద్, షౌకత్ అలీ మీర్జాలను సన్మానిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: దారుషిఫా బాల్ శెట్టికేత్ ప్లే గ్రౌండ్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ది స్టోరీ ఆఫ్ చంద్రయాన్-3పై సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రయాన్‌పై ప్రత్యేక అవగాహన ఏర్పా టు చేసి చంద్రయాన్ ల్యాండింగ్ తదితర విషయాల ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొత్త తరహాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రయాన్ టీమ్ స భ్యుడు ప్రొఫెసర్ సయ్యద్ మక్బూల్ అహ్మద్, హెల్పింగ్ హ్యాండ్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ షౌకత్ అలీ మీర్జాల ను బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ శాలువాతో ఘనంగా సత్కరించారు.

కృష్ణాచారికి సన్మానం

గోల్కొండ: సేవ చేసే వారికే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారి వృత్తి పనివారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండలో పలు విశ్వకర్మ కులస్తులను సన్మానించారు. మూడు దశాబ్దాలుగా విశ్వకర్మ కులస్తులు సేవలందిస్తున్న కృష్ణాచారికి ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.



ఫైనార్ట్స్ యూనివర్సిటీ హాస్టల్ అడ్మిషన్లు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

విజయనగర్‌కాలనీ: మూడేళ్లుగా ఫైనార్ట్స్ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థుల అడ్మిషన్లు చేపట్టడం లేదని, హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టాలి, లేదా నూతన భవనాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు భరత్‌కుమార్ మాట్లాడుతూ.. మూడేళ్లుగా ఫైనార్ట్స్ యూనివర్సిటీకి చెందిన హాస్టల్ శిథిలావస్థలో ఉందని, దీనిని సాకుగా చూపిస్తూ యూనివర్సిటీ యాజమాన్యం హాస్టల్‌లో అడ్మిషన్లు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు ధర్నాలు చేపట్టినప్పటికీ యూనివర్సిటీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రీమంత్‌కుమార్, విజయ్, సురేందర్, రోహన్, శ్యామ్‌చరణ్, విద్యార్థి నాయకులు ఉన్నారు.

బజరంగ్‌దళ్ శౌర్య జాగరణ్ యాత్ర



గౌలిపురా: విశ్వహిందూ పరిషత్తు, బజరంగ్‌దళ్ ఆర్యనగర్ జిల్లా సంయుక్తాధ్వర్యంలో సోమవారం బజరంగ్‌దళ్ శౌర్య జాగరణ్ యాత్ర నిర్వహించారు. సుధా థియేటర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర గౌలిపురా మార్కెట్ మీదుగా లలితాబాగ్‌లోని వీహెచ్‌పీ జిల్లా కార్యాలయం వరకు కొనసాగింది. ఈ యాత్రలో దాదాపు 200 మంది వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీర్ కుమార స్వామి, విశాల్ ప్రసాద్, విశాల్ సునార్కర్, ముఖేశ్, పవన్, శ్రీను, బజరంగ్ దళ్ సౌత్ జోన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ద్విచక్ర వాహనాలతో యువతలో క్రేజ్



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ద్విచక్ర వాహనాలకు బజాజ్ పెట్టింది పేరని బజాజ్ ద్విచక్ర వాహనాలంటే యువతలో ఎంతో క్రేజ్ ఉందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలోని బజాజ్ అభినందన్ షోరూమ్‌లో బజాజ్ ఎన్-150 ద్విచక్ర వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను యువకుడిగా ఉన్నప్పుడు బజాజ్ స్కూటర్ నడిపానని ఇప్పుడు తన పిల్లలు బజాజ్ బైక్‌లు వాడుతున్నారన్నారు. అభినందన్ బజాజ్ రీజనల్ మేనేజర్ సాయిహరి మాట్లాడుతూ..బజాజ్ ఎన్-150 పల్సర్ పోర్ట్‌పోలియోకి సరైన జోడింపు అని అన్నారు. ఆకట్టుకునే డిజైన్‌లో తమ సంస్థ దీనిని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో అభినందన్ బజాజ్ టోలిచౌకి జనరల్ మేనేజర్ వినోద్‌సింగ్, యూట్యూబ్ బ్లాగర్స్ ప్రకాష్ చౌదరి, రవికిరణ్ కస్తూరి, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల ధర్నా

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) విభాగంలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు తమను రెగ్యులర్ చేయాలని కోఠి డీఎంహెచ్ఎస్‌ను ముట్టడించారు. అనంతరం డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్ఎం విభాగంలో 600 మంది డీఎస్‌సీ ద్వారా సెలెక్ట్ అయ్యి 25 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించలేదని వాపోయారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసి అందరి ఉద్యోగులతో సహా వేతనం చెల్లించాలని కోరారు. అలాగే ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరేష్, వైస్ ప్రెసిడెంట్ రంజిత్, తిరుమల్‌రెడ్డి, సమీ, సత్యరెడ్డి, కుమార్, శివ, రజిత, శ్రీదేవి, వివిధ జిల్లాల నుంచి దాదాపు 500 మందికి పైగా ఈ నిరసనలో పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఎస్‌లో ధర్నా నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు